# మున్నా

-కె. వరలక్ష్మి

**"అమ్మా!" అరిచిందో, అరిచానని అనుకుందో కానీ, గాఢమైన నిద్రలోంచి మెలకువ వచ్చేసింది సుశీలకి.**

**కుడిపక్కలో సన్నని నొప్పి. కళ్లు విప్పి చూస్తే కుడికాలు తనమీద వేసి, కుడిచేతిని తన మెడ చుట్టూ వేసి హత్తుకుంటూ, ఎడమ మోకాలితో తన పక్కలో పొడుస్తూ మున్నా. బెడ్‌లైట్ వెలుతురులో దట్టమైన కనురెప్పల నీడ పాలబుగ్గలమీద తురాయి పూల జాడలా.**

**మెలకువొస్తే ఇంక నిద్ర పట్టదు తనకి. రాబోయిన కోపం కాస్తా జాలిగా, ఆ వెంటనే దుఃఖంగా మారి కళ్లు వర్షిస్తూ ...**

**ఎర్రని పెదవులతో చిన్ని మూతి, ఎంత ముద్దొస్తున్నాడు వీడు. తలను దగ్గరకు హత్తుకుని ముద్దులు కురిపించింది.**

**అమ్మా**, నాన్నా ఉండీ లేనట్టు బతుకుతున్న వాణ్ణి చూసినప్పుడల్లా సుశీల గొంతులోకి దుఃఖం ఎగదన్నుకొస్తుంది.

అల్లరల్లరిగా, పెంకితనం, గారాబం కలబోసి, మిన్నూ మన్నూ ఏకం చేసే మున్నా జాలిగా, బేలగా ఎంత నెమ్మదైపోయాడూ!

పొద్దున్నే పనుల తొందరా, బడికెళ్లే హడావుడిలో మరచిపోయినా, రాత్రవుతూనే వాడు "అమ్మేది? అమ్మెప్పుడొస్తుంది? నాన్న రాడంలేదే?" అని క్రమం తప్పకుండా అడిగే ప్రశ్నలు సుశీల గుండెను పిండిచేస్తున్నాయి.

ఓ ఆదివారం 'లిటిల్ సోల్జర్స్' సినిమా చూస్తూ సుశీల మెడను వాటేసుకుని, "అమ్మమ్మా! మా అమ్మా, నాన్నా నన్నిక్కడెందుకు వదిలేశారు? ఈ సినిమాలోలాగే చచ్చిపోయారా?" అంటూ బోరుమని ఏడుపు మొదలుపెట్టాడు.

సుశీల గుండె చెరువైంది.

మడత కుర్చీలో పడుకుని టి.వి. చూస్తున్న మున్నా తాతగారు ఓ క్షణం బిత్తరపోయి, కళ్లమీద తువ్వాలు కప్పుకున్నారు.

"విడిపోడానికి వాళ్ల కారణాలు వాళ్లకుంటాయి. తన బతుకు తనిష్టం!" అంటూ కూతుర్ని సమర్థించిన ఆయనకి ఆచరణలో అదెంత బాధను కలిగించే విషయమో ఇప్పుడిప్పుడే అర్థమవుతోంది.

రజని, సూర్యం ఎవళ్ల పట్టుదలలు వాళ్లు నిలబెట్టుకుంటున్నారే కానీ, ముక్కుపచ్చలారని పసివాణ్ణి గురించి ఆలోచించడంలేదు. మొదట్లోనే సుశీల నచ్చచెప్పబోతే, "అమ్మా! ఆ మూర్ఖుడితో కలిసి ఉండటం నా వల్ల కాదు. నువ్వింక ఈ పాత చింతకాయ పచ్చడి భావాల్ని విడిచిపెట్టేయ్యాలి!" అంది రజని.

ఏడాదిన్నర క్రితం

అప్పటికి మున్నాకి మాటలు పూర్తిగా పలకడం కూడా రాలేదు. మొదట్లో, ఎప్పట్లాగే ఏ పండక్కో అమ్మమ్మ ఇంటికొచ్చాం కాబోలనుకుని ఆనందంగానే ఉండేవాడు. వాళ్లమ్మ తనని అమ్మమ్మ ఇంట్లో వదిలేసి ఊరెళ్లిపోయి సెలవు రోజున ఎప్పుడో తనని చూడడానికొస్తుందని క్రమంగా గ్రహించాడు. వాళ్లమ్మ వెళ్తుంటే ఆపకుండా చిందులు తొక్కి ఏడ్చేవాడు. బాల్యంలో అమ్మా, నాన్నల్ని వదిలి ఉండటం ఎంత కష్టమో, అది చిన్ని గుండెను ఎంతగా తూట్లు పొడుస్తుందో సుశీలకు తెలుసు. తన వెనక తమ్ముళ్లు, చెల్లెళ్లు పుట్టే క్రమంలో సుశీల అమ్మమ్మగారింట్లో కొన్నేళ్లు, మేనమామ ఇంట్లో కొన్నేళ్లూ పెరిగింది. అమ్మా, నాన్నా కసిరినా, ఓ దెబ్బ కొట్టినా కలగని బాధ పరాయింట్లో ఎలా కలుగుతుందో; తన ఇంట్లో తన వాళ్లతో కలిసి ఉండాలని ఎంత గుబులుగా ఉంటుందో ఆమెకి తెలుసు.

"ఇదేం పరాయి ఇల్లా? నాన్నగారికీ, నీకూ మున్నా అంటే ఇష్టమే కదా! ఇదివరకంతా గారాబం చెయ్యటం కాదు, నిజమైన ప్రేమంటూ ఉంటే ఇప్పుడు చూపించండి వాడిమీద!" అంది రజని.

రజనికి అర్థం అయ్యేలా చెప్పడం సుశీల వల్ల కాలేదు.

"మీ వల్ల కాదంటే చెప్పండి, ఏదో ఓ రెసిడెన్షియల్ కాలేజీలో పడేస్తాను!" అంటుంది. తన చికాకు తనది.

"మున్నా! నీకు అమ్మంటే ఇష్టమా, నాన్నంటే ఇష్టమా?"

"నాకు అమ్మంతే ఇష్టం, నాన్నంతే ఇష్టం!"

"నువ్వు అమ్మ దగ్గరుంటావా, నాన్న దగ్గరుంటావా?"

"అమ్మా, నాన్న దగ్గరుంతా!"

"నేనన్నా, తాతగారన్నా ఇష్టం లేదా?"

"కుంచెముంది."

"మా దగ్గరుంటావా?"

"ఊహుఁ, మా ఇంతికెల్లిపోతా!"

సరదా కోసం అడిగే ఇలాంటి ప్రశ్నలకి మున్నా జవాబులు తరచుగా సుశీల కళ్లని నీటి చెలమలుగా మారుస్తున్నాయి. ఆమధ్య జ్వరమొస్తే ఒకటే కలవరింతలు 'అమ్మా! నాన్నా!' అంటూ.

సూర్యం పరాయివాడేం కాదు. రజనికి మేనత్త కొడుకు. అప్పుడు, పెళ్లికి ముందు అంతే, మేనరికం వద్దు అంటే పట్టుబట్టి అతన్నే చేసుకుంది. ఇప్పుడు పట్టుదలల్లో ఇద్దరూ ఏం తీసిపోవడంలేదు.

రజని వచ్చేశాక ఏడాదిపాటు సూర్యం మున్నాని చూడటానికి కూడా రాలేదు.

డైవోర్స్‌కోసం లాయర్ నోటీసు ఇప్పించి అప్పుడు వచ్చాడు. మున్నా ఒక్క పరుగున వెళ్లి అతన్ని హత్తుకుపోయాడు. చాక్లెట్లు, ఆట వస్తువులు ఏవో తెచ్చి ఇచ్చి, కాసేపు ఆడించి, వదిలేసి వెళ్లిపోయాడు. మున్నా గుక్క తిప్పుకోకుండా ఏడ్చాడు. అతను వెనక్కి కూడా తిరిగి చూడలేదు.

తర్వాత ఆ విషయం తెలిసి రజని కోపంతో మండిపడింది. "నా కొడుకుని నేను పెంచుకోలేననుకుంటున్నాడా ఆ ఫూల్?" అంటూ అతను తెచ్చిన ఆట వస్తువులన్నీ విసిరేసింది.

మున్నాని చూసి సుశీల కళ్లొత్తుకుంటుంటే రంగనాయకమ్మగారి జానకి విముక్తి చదువుతూ "అమ్మకి ఏడవడానికో కొత్త విషయం దొరికింది ఎంచక్కా!" అంది రజని.

సుశీల బిత్తరపోయింది.

అవును! తనెందుకింతగా దుఃఖపడుతోంది? వాళ్లిద్దరి మధ్యలో మున్నా ఉండి ఉండకపోతే తనకీ విషయం ఇంతగా బాధించేది కాదేమో! తన కన్నీరు ఎగతాళికి గురికావడం రంపపుకోతలాగా అనిపించింది. ఎవరి బతుకులు వాళ్లవి అనుకోగలిగితే ఈ దుఃఖాలూ, గుండె కోతలూ

ఉండవు కదా!

క్రమంగా మనసును రాయి చేసుకోవాలని నిర్ణయించుకుంది. మానసిక వేదన క్రమంగా సుశీల శరీరాన్ని నిస్సత్తువకి నిలయం చేస్తోంది. మున్నాకి స్నానం చేయించి, యూనిఫాం ఇస్త్రీ చేసి వేసి, టిఫిన్ తినిపించి, బాక్స్ కట్టి స్కూలు బస్సు ఎక్కించి వచ్చేసరికి ప్రాణం సొమ్మసిల్లినట్లవుతోంది. తన పిల్లలు చిన్నవాళ్లుగా ఉన్నప్పుడు చేసిన హుషారు కొనితెచ్చుకుందామన్నా రావడం లేదు. తను నిజంగానే అమ్మమ్మ అయిపోయింది. కీళ్లనొప్పులు, హై బ్లడ్‌ప్రెషర్ శరీరంలో చోటు చేసుకుంటున్నాయి. తనకెంతో ఇష్టమైన హాబీ పుస్తకాలు చదవడం. ఈమధ్యకాలంలో ఒక్క పుస్తకాన్ని ముట్టుకున్న పాపాన పోలేదు.

ooo

ఏ విషయమూ తొందరగా తేల్చుకుంటే సూర్యం మళ్లీ పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాడని కబురొచ్చింది.

ఆరోజు అందరూ ఫైనల్‌గా మాటలకు కూర్చోవాలనుకున్నారు. సూర్యం వాళ్లమ్మ, నాన్నలతో వచ్చాడు.

ముందురోజే రజని సెలవు పెట్టి వచ్చింది.

ఇదంతా వినకూడదని మున్నాని ఎప్పట్లాగే స్కూలుకి పంపించేసింది సుశీల. ఉదయం నుంచి వంటింటి పనిలో నలిగిపోతూ హాల్లోంచి వినిపిస్తున్న మాటలకి రకరకాల ఉద్వేగాలకి లోనవుతోంది.

"డైవోర్స్‌కి అప్లయ్ చేశాడుగా, రానివ్వండి చూద్దాం!" అంది రజని ఉక్రోషంతో, గొంతులో దుఃఖంతో.

తల్లిగా, స్త్రీగా రజని బాధ, బంధాన్ని తెంచుకోలేకపోవడం సుశీలకి అర్థం అవుతోంది.

అవతలావిడ అత్తగారాయె. దానికితోడు ఆడపిల్లల్ని కన్నతల్లి కాదు. "లేకపోతే మగాడు ఎన్నాళ్లాగుతాడే?" అంటోంది.

"అవును, ఆగడు! పెళ్లాం దగ్గరుండగానే ఆగడు!"

"మగాడు వెయ్యి తిరుగుళ్లు తిరుగుతాడు, చూసీ చూడనట్టూరుకోవాల. అందుకోసం కాపరాల్ని కూల్చుకుంటామా?"



"నువ్వు ఆడదానివై ఉండీ మగాడు మగాడు అని వంతపాడక, నాకు చిర్రెత్తికొస్తోంది. ఇదిగో, ఇలాంటి స్టుపిడిటీతోనే కొడుకునలా తయారు చేశావు!"

"నువ్వుమాత్రం ఏం తక్కువ తిన్నావ్. నీ కొలీగ్స్‌తో వికవికలూ పకపకలూ నాకు తెలీవనుకున్నవా?" అందుకున్నాడు సూర్యం.

"షటప్ యువర్ మౌత్! అత్తమ్మా, నీ కొడుకుని ముందు నోరు మూసుకోమని చెప్పు, లేకపోతే ఏం చేస్తానో నాకే తెలియదు!"

"చూశారా, చూశారా, ఎంత పొగరో దానికి?"

అవమానం, కోపం పట్టలేక ఏడుస్తోంది రజని.

"నువ్విలా బుల్‌బుల్ దుఃఖాలు తీస్తే నేను కరిగిపోయి నీ కాళ్లు పట్టుకుంటా ననుకుంటున్నావేమో, అలా ఎప్పుడు జరగదు!"

"మాటలు జాగ్రత్తగా రానీ!"

"ఆ ఉక్రోషమే తల్లీ, నీ కొంప ముంచబోతా ఉంది!" అత్త.

"ఏంటి మునిగేది? ఐ డోంట్ కేర్!"

రజని మాట్లాడుతున్న ఆ మాటలన్నీ పైపై బింకం కోసమేనని సుశీలకి తెలుసు. అంతా నిద్రపోతున్న అర్ధరాత్రివేళ రజని కుమిలి కుమిలి ఏడవడం సుశీల చూసింది.

చిన్నతనం నుంచీ రజనికి కోపం, ఉక్రోషం ఎక్కువే. పిలిస్తే పలికేలా ముక్కుమీదే ఉంటాయి. ఇంట్లో అందరూ సరిపెట్టుకుని పోతూ ఉండేవారు. అత్తింట్లో అలా ఎవరు సరిపెట్టుకుంటారు?

అటు సూర్యానికీ ముంకుతనం ఎక్కువ.

అటునుంచీ, ఇటునుంచీ తండ్రులిద్దరూ నిమ్మకు నీరెత్తినట్టు మౌనంగా కూర్చున్నారు.

రజని, సూర్యం తిరిగి మళ్లీ మొదటికొచ్చారు. అందరూ కూర్చుని మాట్లాడి ఇద్దరూ రాజీపడేలా చేస్తారనుకుంటే, ఆ సూచనలేమీ కనిపించడంలేదు. నిప్పంటుకున్న గడ్డివాములా లోపల లోపల్నుంచీ పొగ రాజుకుపోతోంది. రజని, అతను ఎప్పటెప్పటి మాటల్తోనో ఎత్తిపొడుసుకుంటూ మంటల్లో ఆజ్యం పోసుకుంటున్నారు.

మున్నా స్కూలు నుంచి వచ్చాడు.

చాన్నాళ్లకు అమ్మనీ, నాన్ననీ ఒక్కచోట చూసి ఆనందం పట్టలేక నవ్వబోయి, అంత కోపంలో చూసి భయపడ్డాడో ఏమో మౌనంగా నిల్చుండిపోయాడు. బిక్కుబిక్కుమని ఇద్దరినీ మార్చి మార్చి చూస్తున్నాడు.

వాళ్ల నానమ్మ పిలిచి ఒళ్లో కూర్చోబెట్టుకుంది.

"మా అమ్మకి ఓపిక లేదని.కానీ, లేకపోతే నా పిల్లాణ్ణి నీ దగ్గరుంచాల్సిన అవసరం లేదు!" అంటున్నాడు సూర్యం.

'మీ అమ్మకు లేని ఓపిక మా అమ్మకుందా?' అనలేదు రజని.

"మరే, ఎక్కడుంటే ఏం వాడు మన రక్తంలో రక్తం. మున్నా, నువ్వెక్కడ పెరిగినా, పెద్దయ్యాక మనింటికొచ్చి, ఇంటి పేరు నిలపవలసినవాడివేరా!" అంటోంది మున్నా నానమ్మ.

"ఆహా.... అలాంటి ఆశలేం పెట్టుకోకండి. వాడిని కన్నతల్లిని. వాడెప్పుడూ నాకే చెందుతాడు. నా కొడుకుని నా ఇష్టం వచ్చినట్టు పెంచుకుంటాను. మధ్యలో మీ ప్రమేయాలేం అక్కర్లేదు!" రజని.

"ఆ... పెంచేస్తావు. రోజంతా ఉజ్జోగం ఎలగబెడుతూ పిల్లోణ్ణి కూడా పెంచేస్తావు!" అత్త ఈసడింపు.

"నాకు తీరిక లేకపోతే ఏమైంది, మా అమ్మ ఉంది కదా! మా అమ్మకి వాడంటే ప్రాణం. ఎలాగూ ఇక్కడ అలవాటయ్యాడు, ఇక్కడే అమ్మమ్మ ఇంట్లో పెరుగుతాడు."

పెరగాల్సిన మున్నానీ, పెంచాల్సిన సుశీలనీ ఎవరూ అభిప్రాయం అడగలేదు.

అమ్మా, నాన్నా ఉండగానే పిల్లలు అమ్మమ్మల దగ్గరా, ఆంటీల దగ్గరా, ఇంకా ఘోరంగా హాస్టల్ మేట్రన్స్ దగ్గరా పెరగడం ఎంత జాలిగొలిపే విషయం!

సుశీల ఓ నిర్ణయానికి వచ్చి, అందరూ కూర్చున్న హాల్లోకి వచ్చింది.

"నేను మున్నాని పెంచబోవడంలేదు."

"అమ్మా...!" అంది రజని ఊహించని పరిణామానికి ఉలిక్కిపడుతూ.

"అవును, రజనీ! మిమ్మల్ని కన్నప్పటినుంచీ నాకు విశ్రాంతి అనేదే లేదు, తెలుసా? మిమ్మల్ని పెంచి పెద్దచేసి, మీ చదువుసంధ్యలకి దోహదపడి, పెళ్లిళ్లు చేసి, పురుళ్లూ, పుణ్యాలూ చూసేసరికి నా ఓపిక అడుగంటింది. బయట ఉద్యోగానికెళ్లలేదన్న మాటే గానీ, ఇంటి చాకిరీ నా ఎముకల్ని శిథిలం చేసేసింది. రేపు నీ కొడుకుతోబాటు అక్క తన పిల్లలిద్దర్నీ పెంచమంటుంది. తిరిగి ఇప్పుడు పిల్లల పెంపకంతో జీవితాన్ని మళ్లీ ప్రారంభించాలంటే నా వల్ల కాదు. కొన్నిరోజులపాటు లేవకుండా నిద్రపోవాలన్నంత అలసటగా ఉంది నాకిప్పుడు. నా బాధ్యతలు నిర్వహించడం పూర్తయింది. మీ బాధ్యతల నుంచి మీరు పలాయనం కాకండి!"

ఎదుటివాళ్ల మొహాలు చూసి, తనెంత ఆవేశంగా మాట్లాడిందో గ్రహించుకుని కొంచెం ఇబ్బంది పడింది సుశీల. అందుకే, అందర్నీ డైవర్ట్ చేయాలని "మున్నా, నువ్వెక్కడుంటావే?" అంది.

మున్నా వాళ్ల నానమ్మ ఒడిలోంచి లేచి వాళ్ల నాన్న దగ్గరకెళ్లి చెయ్యి పట్టుకుని వాళ్లమ్మ కూర్చున్న చోటికి తీసుకొచ్చాడు.

"నేను అమ్మదగ్గరా, నాన్నదగ్గరా ఉంటా! నాకు అమ్మా కావాలి, నాన్నా కావాలి. మేం ముగ్గురం ఒకే ఇంట్లో ఉంటాం" అన్నాడు ఎవరో పాఠం నేర్పినట్టు.

రజని కళ్లెత్తి సూర్యాన్ని చూసింది. సూర్యం చూపులు రజని చూపుల్లో కలిశాయి.

ఇద్దరి కళ్లోంచి ఆవేశకావేషాలు నిష్క్రమించాయి.

■

